సాక్షి
కాకినాడ

శుక్రవారం, 1, ఆగస్టు, 2025



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మానేపల్లి సాయిబాబా, లక్ష్మీదేవి దంపతులు (తణుకు) రూ.లక్ష విరాళాన్ని గురువారం సమర్పించారు.



బదిలీ భారం

మినిమమ్ టైమ్ స్కేల్ విధానంలో పని చేస్తున్న 220 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ప్రస్తుతం బదిలీల బాధలతో సతమతమవుతున్నారు.

8లో

4.52 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 4,52,898 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. 10.40 అడుగులకు నీటి మట్టం చేరింది. గోదావరి డెల్టా కాలువలకు సంబంధించి 14,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

నేడు పింఛన్ల పంపిణీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో ఈ నెల ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని మండల, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ నేపథ్యంలో 2,73,065 మందికి రూ.118.27 కోట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో అదనంగా మరో 4,763 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు అయ్యాయని కలెక్టర్ తెలిపారు.

అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ

జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం అమలుపై గురువారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 2వ తేదీన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద జిల్లాలో 1.48 లక్షల మంది రైతులకు రూ.98.8 కోట్లు అందించడం జరుగుతుందన్నారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.7 వేలు అర్హులైన రైతులకు అందిస్తోందన్నారు. అర్హుడైన చివరి రైతు వరకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం వర్తింప చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్ విజయకుమార్, ఇతర వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కడియం నర్సరీ అందాలు అద్భుతం



రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులును సత్కరిస్తున్న నర్సరీ రైతులు

కడియం: నర్సరీ అందాలు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఆ నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ మొక్కనిచ్చి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నర్సరీ రైతులకు ప్రభుత్వ ద్వారా తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ పాటిస్తూ నర్సరీలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. వైఎస్సార్ హెచ్ ఓ డైరెక్టర్ బి.గోవిందరాజు, కొవ్వూరు పరిశోధన క్షేత్రం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లలిత కుమారేశ్వరి, సీనియర్ సైంటిస్టులు డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ వి శివకుమార్, ఏపీఎంఐపి పిడి ఎ. దుర్గేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్. మల్లికార్జునరావు, కడియం ఉద్యాన శాఖ అధికారి పి.లావణ్య పాల్గొన్నారు.

జర్మనీ భాషలో ఉచిత శిక్షణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో గల ఎస్సీ,ఎస్టీ కులాలకు చెందిన నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీ భాషలో బి2 స్థాయి కోసం ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం కల్పించటానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత శాఖ అధికారి ఎమ్.డి. గవాజుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు చేసుకునే విద్యార్థి వయసు 35 సంవత్సరములు లోపు ఉండాలన్నారు. బీఎస్ఎం గాని, బీఎస్సీ నర్సింగ్ కోర్సు గాని చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు ఆగస్టు 6వ తేదీలోపు అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక అయిన విద్యార్థులకు 8 నుంచి 10 నెలల వరకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. శిక్షణ విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలలో మాత్రమే ఇస్తారన్నారు. పూర్తి వివరాల కోసం మొబైల్ నంబర్లు 99488 68862, 83400 94688 లలో సంప్రదించాలన్నారు.

పింఛన్ల పేరిట వంచన

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన ఉండదని మరోసారి తేలింది. కూటమి హామీలతో మోసపోయిన జాబితాలో తాజాగా వితంతువులు కూడా చేరారు. భర్త మరణిస్తే భార్యకు ఇవ్వాల్సిన పెన్షన్‌ను కూడా ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబు సర్కార్‌కే దక్కుతుంది. జిల్లా వ్యాప్తంగా 3,801 మందికి స్పౌజ్‌పెన్షన్ రెండు నెలలు కింద మంజూరైందంటూ తెలిపి ఈ ఏడాది జూన్ 12వ తేదీన పెన్షన్ ఇస్తామని నమ్మబలికారు. తాజాగా మరోసారి పెన్షన్ ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నామంటూ ప్రచారార్భాటానికి దిగారు. అర్హులని తేలినప్పటికీ 3,801 మందికి నెలకు రూ.1.52 కోట్ల చొప్పున రెండు నెలలకి రూ.3.04 కోట్లు ఎగ్గొట్టింది. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళలను ప్రభుత్వం తరఫున వీలైనంత త్వరగా ఆదుకోవాల్సింది పోయి ఇలా ఆలస్యం చేసి వారిని వంచించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉచితం.. బుస్సు!

- పల్లె వెలుగుతోనే ఉచిత ప్రయాణం
- అయినా మరో 100 సర్వీసుల అవసరం
- 12 లక్షల మంది మహిళల ఎదురుచూపు
- బాబు మార్క్ మరో మోసం

ఏదైనా పథకం ప్రారంభిస్తున్నాం అంటే ఇంతవరైనా నమ్ముతారేమో కానీ.. చంద్రబాబు అంటే మాత్రం నమ్మరు. తీసివేతలు, భాగహారాలు లేకుండా ఆయన పథకాలు ఏవీ వర్తింపజేయరని, అవన్నీ పోగా నామమాత్రపు లబ్ధిదారులు మిగులుతారని.. ఆ మిగిలించుకోవడంలో ఆయన సిద్ధహస్తులని పలువురు విశ్లేషకుల అభిప్రాయం. ఆయన సూపర్ సిక్స్ పథకాల్లో ఉచిత బస్సు పథకం కూడా అలాంటిదే. పల్లె ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని.. వారి జీవన విధానాల్లో మార్పులు రావాలని ప్రయాణ సమస్యలు తీర్చాలని ఏర్పాటు చేసిన పల్లె వెలుగు బస్సుల లక్ష్యాన్ని నీరుగార్చేసింది చాలక.. అరిగిపోయిన.. మరమ్మతులకు నోచుకోని ఈసురోమంటూ నడిచే ఆ వాహనాలను మహిళలకు ఉచిత బస్సు పథకానికి వినియోగించనున్నట్టు తెలుస్తోంది. ప్రతి శివారు పల్లెకు బస్సు సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆ బస్సులను ఇప్పటికే చాలా వరకు ఆక్యుపెన్సీ రేటు లేదని తగ్గించేశారు. మిగిలిన బస్సులను ఉచిత బస్సు పథకానికి వినియోగించనున్నట్టు తెలుస్తోంది. మరి ఉన్న అరకొర బస్సులతో లక్షలాది మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఎలా అమలు చేస్తారో.. ఈ పథకానికి ఎన్ని గొళ్లేలు పెట్టనున్నారో.. ఎంత మంది మహిళలకు ప్రయోజనం చేకూరనుందో చూడాలి.



సాక్షి ప్రతినిధి, కాకినాడ: చంద్రబాబు మాటల గారడీతో మరోసారి మహిళలు మోసపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో బాబు ఇచ్చిన హామీ నమ్మి దగా పడ్డ మహిళాలోకం తిరగబడే రోజులు దగ్గరపడ్డాయి. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబుతో పాటు కూటమి నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. చంద్రబాబు గద్దె నెక్కి ఏడాదైనప్పటికీ సూపర్ సిక్స్‌లో ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేసింది లేదు. తల్లికి వందనం పేరు చెప్పి అర్హులైన వేలాది మంది తల్లులు ఇప్పటికీ సచివాలయాలు, విద్యుత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. ఇప్పుడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15న ఆర్టీసీలో అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించగానే మహిళలు ఎగిరి గంతేశారని చెప్పొచ్చు. మరో పక్షం రోజులు ఆగితే ఏ ఊరు వెళ్లాలన్నా ఆర్టీసీలో ప్రయాణం ఉచితమే అనుకుని సంబరపడ్డారు. తీరా ఉచిత ప్రయాణం అన్ని బస్సుల్లో అమలుచేయడం లేదని తెలిసి చంద్రబాబు మోసంపై మహిళలు నిప్పులు చెరుగుతు న్నారు. ఉచిత ప్రయాణం పల్లె వెలుగులకే పరిమితమంటుంటే మహిళల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఉచిత బస్సు పథకం ఉత్తుత్తి బస్సుగా మారుతుందని మహిళలు చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రంగా ఉంది. ఫలితంగా 200 గ్రామాలకు పైనే ఆర్టీసీ బస్సులు తిరగడం లేదు. పల్లెలకే కాకుండా పుణ్యక్షేత్రాలకు సరిపడా బస్సులు ఉండటం లేదు.

జిల్లా ఆర్టీసీ సమాచారం

ఏలేశ్వరం	39
కాకినాడ	79
తుని	57
మొత్తం డిపోలు	3
మొత్తం బస్సులు	175

కొత్త బస్సుల ఊసేదీ?

కాకినాడ జిల్లాలో పల్లె వెలుగు 125, అల్ట్రా పల్లె వెలుగు సర్వీసులు 39 మాత్రమే ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 19 వరకు నడుస్తున్నాయి. జిల్లాలో 12 లక్షల మంది మహిళలు ఉన్నారని అంచనా. సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకారం చూసుకుంటే 12 లక్షల మందికి అవసరమైన సర్వీసులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో అన్ని సర్వీసులు ఆర్టీసీకి లేవు. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలంటే జిల్లాలో తక్కువలో తక్కువ అదనంగా వంద బస్సులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇన్ని బస్సులు ఒకేసారి నిర్వహించాలంటే ఇప్పుడున్న సిబ్బంది సంఖ్యను మరింత పెంచాల్సి ఉంటుంది. 100 మంది డ్రైవర్లు, 100 మంది కండక్టర్లు అవసరమవుతారని చెబుతున్నారు. ఇప్పుడు నడుస్తున్న బస్సులతోనే సర్దుబాటు చేయడం ఎంత మాత్రం వీలుకాదని ఆర్టీసీ అధికారులు బహిరంగంగానే చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్తున్న పల్లెవెలుగు సర్వీసులను ఉచిత బస్సుల కోసం ప్రధాన ప్రాంతాల్లో నిర్వహిస్తే పల్లెల్లో బస్సు సర్వీసుల పరిస్థితి ఏమిటో అర్థంకావడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో కొత్త సర్వీసుల ఊసేలేదు. పాడైన కొన్ని సర్వీసులను మాత్రమే కొత్త బస్సులుగా మార్చారని తెలిసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి డిపోకు కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని తేదేపా నేతలు చెప్పి మాటలు నీటిమీద రాతలుగానే మిగిలాయి. కాకినాడ సిటీలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెడతామని చెప్పిన మాటలు ఏమయ్యాయని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఏలేశ్వరం, తుని, కాకినాడ ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. కొత్త బస్సులను ఏర్పాటు చేయకుండా ఉన్న పల్లెవెలుగు బస్సులను ఉచిత బస్సు పథకం కోసం వినియోగిస్తే మిగిలిన సర్వీసుల పరిస్థితి డోలాయమానంలో పడుతుందని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

కొన్నింటిలోనే ఉచితం

ఉచితం అన్ని బస్సుల్లో కాదని.. కొన్నింటిలో మాత్రమే ఉంటుందని ఆర్టీసీ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చింది. ఎన్నికల సమయంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ ఆర్భాటంగా ప్రకటించారు. ఇప్పుడు చూస్తే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే ఉచితంగా మహిళలు ప్రయాణించడానికి అవకాశం కల్పిస్తామని చెబుతున్నారు. ఉచిత బస్సు పథకం అమలుచేయడం పల్లెవెలుగు సర్వీసులపైనే ఆధారపడుతుందంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో మాత్రమే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీ కేటా**యించిన బస్సుల్లో** మాత్రమే మహిళలు **ప్రయాణించాల్సి ఉంటుం**దంటున్నారు. జిల్లా **దాటితే టిక్కెట్ తీసుకోవాల్సి** ఉందని చెబు**తున్నారు. అదీ కూడా** రోజుకు ఒకసారి **మాత్రమే ఓ మహిళ** ప్రయాణం చేయడానికి **వీలుంటుందని ఆ శాఖ** అధికారులు పేర్కొం**టున్నారు. ఆదాయం** రాని మార్గాల్లో పల్లెవె**లుగు బస్సులు ఇప్పటికే** రద్దు కాగా మరికొన్ని **ఎత్తివేసే పరిస్థితి** కనిపిస్తోంది. ఫలితంగా **గ్రామీణ ప్రాంతాలకు** వెళ్లాల్సిన ప్రయాణికు**లకు తిప్పలు తప్పవని** అంతా భావిస్తున్నారు. **ఇప్పటికే సుమారు 200** మార్గాల్లో పల్లెవెలుగు **బస్సులు నడవడం లేదు**. ఉన్న సర్వీసులను **ఉచిత బస్సు పథకానికి** వినియోగిస్తే జిల్లాలోని ఏ గ్రామీణ ప్రాంతానికీ పల్లె వెలుగు సర్వీసులు నడిచే పరిస్థితులు ఉండవని అంటున్నారు.

మార్గదర్శకాల కోసం నిరీక్షిస్తున్నాం



ఇంత వరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై జిల్లా స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చే మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. జిల్లా వ్యాప్తంగా కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోల పరిధిలో ఉన్న బస్సులనే ఎలా సర్దుబాటు చేయాలనేది అంచనా వేస్తున్నాం.

– ఏ శ్రీనివాసరావు, జిల్లా ప్రజారవాణా అధికారి, కాకినాడ

అన్ని బస్సుల్లోనూ అనుమతించాలి



ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతవరకు అమలు చేస్తారో వేచి చూడాల్సిందే. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం చూసుకుంటే ఆర్టీసీ నిర్వహించే అన్ని రకాల బస్సుల్లోను ఉచిత ప్రయాణం కోసం మహిళలను అనుమతించాలి. కానీ అలా అమలు చేస్తారని నమ్మకం కలగడం లేదు. ఆయన ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలుచేయక పోవడంతో ఈ అభిప్రాయానికి రావాల్సి వస్తోంది. ఏదో మొక్కుబడిగా అమలు చేసి చేతులు దులిపేసుకుంటారనే అనుమానం కలుగుతోంది.

– వర్ధినీడి సుజాత, అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం, కాకినాడ జిల్లా

పవిత్ర క్షేత్రాల్లో ఆధ్యాత్మిక యాత్ర


బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): పవిత్ర క్షేత్ర సందర్శనలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టినట్టు ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ జీ తెలిపారు. కాకినాడ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. యాత్ర సెప్టెంబర్ 9వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్, కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు. ఈ యాత్ర పదిహేను రోజులు సాగుతుందన్నారు. ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు, సౌత్ స్టార్ రైలు, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన అగ్రశ్రేణి టూరిస్ట్ రైలు ఆపరేటర్ 'టూర్ టైమ్స్' ఈ యాత్రకు నడుం బిగించిందన్నారు. ఈ యాత్రలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారక, సిద్ధపూర్, మధుర, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసి, గయ వంటి పవిత్ర పుణ్య క్షేత్రాల దర్శించుకునే వీలుంటుందన్నారు. గతంలో ఇండియన్ రైల్వేస్ టూర్ టైమ్స్ ప్యాకేజీకి విశేష స్పందన లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి 650 మంది యాత్రికులతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలు, పురాణాల ప్రకారం ఈ యాత్రలో ఉన్న క్షేత్రాలు ఎంతో పేరు గాంచాయన్నారు. ఈ రైలు లోపల, బయట దక్షిణ భారత భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. లగేజీ భారం ఉండదన్నారు. దర్శనానికి అవసరమైన బ్యాగ్ మాత్రమే మోయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. టికెట్ ధరలు థర్డ్ ఏసీ రూ.45,750, సెకెండ్ ఏసీ రూ.54,100, ఫస్ట్ ఏసీ రూ.69500 ఉంటాయన్నారు. అనంతరం యాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ యాత్ర టికెట్లను 93550 21516 నంబర్‌కు ఫోన్‌చేసి బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో టూర్ టైమ్స్ మేనేజర్ యాకేశ్ పాల్గొన్నారు.



యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ జీ

రత్నగిరి విశ్రాంత ఈఓ పెన్షన్‌లో 25 శాతం కోత

- 1998-99లో అక్రమ కొనుగోళ్లపై అభియోగాలు
- విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదించిన ఏసీబీ
- ట్రిబ్యునల్ తీర్పుతో దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు



అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయంలో గతంలో ఈఓగా పని చేసిన ఎన్.సోమశేఖర్ అవినీతికి పాల్పడినట్టు వచ్చిన అభియోగాలపై ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు మేరకు ఆయన పెన్షన్‌లో 25 శాతం కోత విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి వి.వినయ్ చంద్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. 1998–99 కాలంలో ఆయన ఈఓగా టెండర్ పిలవకుండా నిబంధనలకు విరుద్ధంగా సత్యదేవుని వెండి స్టాండ్లు, క్యాలెండర్లు, గ్రీటింగ్ కార్డులు కొనుగోలు చేసినట్టు, మరో 17 అంశాలలో అవినీతికి పాల్పడినట్టు ఆయనపై, మరో 53 మంది సిబ్బందిపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఏసీబీ అధికారులు విచారణ జరిపి ఆయన చర్యల వల్ల దేవస్థానానికి ఆర్థికంగా నష్టం వాటిల్లిందని, ఆయనపై చర్య తీసుకోవాలని 2018లో ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై ట్రిబ్యునల్ షోకాజ్ నోటీసు జారీ చేస్తూ ఆయన పెన్షన్‌లో 25 శాతం కోత విధిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఆదేశాలపై సోమశేఖర్ బదులిస్తూ దేవస్థానంలో 20 ఏళ్లుగా కొనసాగుతున్న విధానం మేరకే తాను వాటిని కొనుగోలు చేశానని, వాటిని దేవదాయశాఖ కమిషనర్ సైతం ఆమోదించారని పేర్కొన్నారు. ఆ చర్యల వల్ల ఆలయానికి ఆర్థిక నష్టం జరగలేదని పేర్కొన్నారు. తాను 2013లో పదవీ విరమణ చేశానని, ఈ అభియోగాల వల్ల తన పెన్షన్ ప్రయోజనాలు పూర్తిగా అందడం లేదని, తనపై అభియోగాలు తొలగించి పూర్తి పెన్షన్ ఇవ్వాలని కోరారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చి ట్రిబ్యునల్ తీర్పు మేరకు పెన్షన్‌లో 25 శాతం కోత విధిస్తూ ఆదేశాలు ఇచ్చింది. కాగా, ఈ అభియోగాలపై జరిగిన విచారణలో 31 మంది సిబ్బందికి క్లీన్‌చిట్ ఇవ్వగా, మిగిలిన 22 మందిపై విచారణ కొనసాగుతున్నట్లు ఆ ఆదేశాలలో పేర్కొన్నారు.

బాలల సంక్షేమం, సంరక్షణే ధ్యేయం

జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీనివాసరావు



శిక్షణ ఇస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీనివాసరావు

తుని రూరల్: బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వారి సంరక్షణే ధ్యేయం కావాలని జిల్లా బాలల రక్షణ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ కె.శ్రీలత అధ్యక్షతన తుని, కోటనందూరు మండలాలకు చెందిన గ్రామస్థాయి బాలల సంక్షేమ, మండలస్థాయి పరిరక్షణ కమిటీల శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల రక్షణ, హక్కుల రక్షణకు కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికే వివాహ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని, బాల్య వివాహాలు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇస్తే సచివాలయ అడ్మిన్, కార్యదర్శులు కఠిన చర్యలకు గురవుతారన్నారు. అత్యవసరమైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. దత్తత ప్రక్రియపై పిల్లలు లేని తల్లిదండ్రులకు వివరించి, శిశుగృహాల గురించి చెప్పాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, అనారోగ్యాలను తెలియజేయాలన్నారు. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులు, పోక్సో చట్టాలపై శిక్షణలో వివరించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఏసీడీపీఓ కె.శ్రీకళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వీఆర్వోలు, ఏఎన్ఎంలు, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు.

తగ్గుతున్న వరద గోదారి



అన్నంపల్లి అక్విడెక్టును తాకుతూ ప్రవహిస్తున్న వరద

ఐ.పోలవరం: గోదావరి క్రమేపీ శాంతిస్తోంది. వరద నెమ్మది నెమ్మదిగా తగ్గుతోంది. ధవళేశ్వరం బ్యారేజీకి వరద జలాల రాక తగ్గుతోంది. దీనితో బుధవారం ఉదయం ఆరు గంటల సమయానికి దిగువునకు 5,86,477 క్యూసెక్కులు విడుదల చేయగా, సాయంత్రం ఆరు గంటల సమయానికి 5,14,177 క్యూసెక్కులకు తగ్గింది. గురువారం ఉదయం ఆరు గంటల ప్రాంతానికి 4,71,927 క్యూసెక్కులకు వరద తగ్గింది. అయితే బ్యారేజీ వద్ద ఉధృతి తగ్గినా దిగువున లంక గ్రామాలను వరద వీడలేదు. ఐ.పోలవరం మండలం అన్నంపల్లి, పి.గన్నవరం అక్విడెక్టులను తాకుతూ ఇంకా వరద నీరు ప్రవహిస్తోంది. గోదావరికి జూలై నెలలో రెండవ సారి వచ్చిన వరద కూడా స్వల్పంగానే ప్రభావం చూపించడంతో లంక వాసులు ఊపిరిపీల్చుకున్నారు.

సగటున పది మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో బుధవారం రాత్రి పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున 10 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యధికంగా పి.గన్నవరం మండలంలో 36.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మలికిపురం మండలంలో ఒక మిల్లీమీటర్ కురిసింది. అంబాజీపేటలో 30.8, అమలాపురంలో 25.2, ముమ్మిడివరంలో 20.4, ఐ.పోలవరంలో 16.4, మామిడికుదురులో 16.2, అల్లవరంలో 12.8, ఉప్పలగుప్తంలో 11.8, రాజోలులో 10, అయినవిల్లిలో 9.6, కాట్రేనికోనలో 9.2, మండపేటలో 6.2, కొత్తపేటలో 5, కె.గంగవరంలో 4.2, ఆత్రేయపురంలో 3.6 మిల్లీ మీటర్లు నమోదైంది.

స్మార్త ఆగమ విద్యార్థులకు అస్వస్థత

- తుని ప్రభుత్వ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స
- నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం : డీఎంహెచ్ఓ

అన్నవరం: సత్యగిరిపై నిర్వహిస్తున్న సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని రాత్రి తుని ప్రభుత్వాస్పత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. కొండదిగువన ఆరెంపూడి సత్రంలో దత్తపీఠం ఆధ్వర్యంలో జరిగిన యాగంలో వారు నాలుగు రోజులుగా పాల్గొని అక్కడే భోజనాలు చేశారు. వారిలో స్వరూప్, సత్యయశ్వంత్, సాయి స్వరూప్, సుధాకర్, ఫణీంద్ర కుమార్, కార్తిక్, సాయి గణేష్, సాత్విక్‌లకు బుధవారం నుంచి వాంతులు, విరేచనాలు అవుతుండడంతో స్థానిక దేవస్థానం ఆసుపత్రిలో వైద్యం అందించారు. గురువారం పరిస్థితి విషమించడంతో వారిని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న డీఎంహెచ్ఓ నర్సింహనాయక్ విద్యార్థులను పరామర్శించి అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని ఆందోళన అవసరం లేదన్నారు. దేవస్థానం ఏఈఓ పెండ్యాల భాస్కర్ ఆసుపత్రిలోనే ఉండి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



తుని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



విద్యార్థుల పరిస్థితిపై వైద్యులను ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ నర్సింహనాయక్

శ్రీవారి ఆలయానికి ముడి వెండి విరాళం



ముడి వెండిని అందజేస్తున్న వెంకన్నబాబు, సత్యరత్నభవాని దంపతులు

రాయవరం: మండల కేంద్రమైన రాయవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం దాతలు ముడి వెండిని విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన దుర్గపు వెంకన్నబాబు, సత్యరత్నభవాని దంపతులు, కుటుంబ సభ్యులు కలసి రూ.1.01 లక్షల విలువైన ముడి వెండిని మకర తోరణం తయారీ కోసం సమర్పించారు. వారిని గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, స్థానిక నేతలు వల్లూరి శ్రీనివాస చౌదరి, పులగం శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకులు పెద్దింటి కృష్ణమాచార్యులు అభినందించారు. ముక్కోటి ఏకాదశి సమయానికి మకర తోరణం సిద్ధం చేసేందుకు ఆలయ కమిటీ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిశోర్

రాజమహేంద్రవరం రూరల్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గైడెన్స్ ప్రకారం బ్యాంకులు, ఏటీఎంల వద్ద నిర్దేశిత భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలని ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశించారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని వివిధ బ్యాంకు అధికారులు, సెక్యూరిటీఅధికారులతో బ్యాంకులు, ఏటీఎంల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సమావేశం నిర్వహించారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద నేర నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రత పరంగా తీసుకోవలసిన చర్యల గురించి పి.పి.టి. ద్వారా జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ వివరించి సూచనలు చేశారు. బ్యాంకు విధుల్లో నియమించుకునే తాత్కాలిక సిబ్బంది, అవుట్ సోర్సింగ్ భద్రతా సిబ్బందికి ముందుగా పోలీసు వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. ప్రతి బ్యాంకు, ఏటీఎం వద్ద 24 గంటలూ పనిచేసే నైట్ విజన్ ఏతు సీసీటీవీలను అమర్చుకోవాలన్నారు. ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు బ్యాంకు అధికారులకు కాల్ చేసే సౌకర్యంతో కూడిన భద్రతా అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సెక్యూరిటీ, ఫైర్ సెక్యూరిటీ పరికరాల పనితీరును క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. విడిగా ఉన్న ఏటీఎంలు, బ్యాంకుల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. బ్యాంకు సిబ్బంది పోలీసు సిబ్బందితో సంబంధాలు ఏర్పరుచుకోవాలని, అత్యవసర సమయాలలో సంప్రదించడానికి వీలుగా పోలీసు అధికారుల కాంటాక్ట్ డీటెయిల్స్ కలిగి ఉండాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన సర్వైలెన్స్ రిపోర్టును సంబంధిత స్టేషన్‌కు విధిగా పంపాలన్నారు.

క్లుప్తంగా

అన్నవరం ఈఈకి అదనపు బాధ్యతలు


రామకృష్ణ, ఈఈ

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) వి.రామకృష్ణకు సింహాచలం దేవస్థానం ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. గత మే నెలలో సింహాచలం దేవస్థానంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందిన దుర్ఘటనలో అక్కడ ఈవోతో పాటు ఈఈని ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈఈ స్థానంలో అన్నవరం దేవస్థానం ఈఈ రామకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపై రెండు దేవస్థానాలలో ఆయన సేవలు అందిస్తారు.

గుండెపోటుతో నవ వధువు మృతి

రాజవొమ్మంగి: అత్తవారింటికి కోటి ఆశలతో బయలుదేరాల్సిన నవ వధువు గుండె నొప్పితో కుప్పకూలి ప్రాణాలు విడిచింది. అందరినీ కన్నీరు పెట్టించిన ఈ హృదయ విదారక ఘటన గడుఓకుర్తి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామంలో గిరిజన కుటుంబానికి చెందిన రమాదేవి (21)కు సుమారు రెండు నెలల క్రితమే ప్రత్తిపాడు మండలం బాపన్నదొర గ్రామానికి చెందిన రాజుబాబుతో వివాహం అయ్యింది. ఆషాఢ మాసం ముగియడంతో ఆమెను తీసుకువెళ్లేందుకు అత్తింటి నుంచి భర్త, ఇతర కుటుంబ సభ్యులు వచ్చారు. ఇంటిల్లిపాదీ రమాదేవిని అత్తవారింటికి పంపించే పనిలో సందడిగా ఉన్నారు. అప్పటివరకు ఇంట్లో అందరితో కలియ తిరిగిన రమాదేవి గుండెల్లో నొప్పి అంటూ ఒక్కసారిగా కుప్పకూలి స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు అక్కడికి వచ్చిన 108 సిబ్బంది ఆమెకు సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) చేసి ప్రాణం నిలిపేందుకు ప్రయత్నించారు. ఫలితం కనిపించకపోవడంతో వెంటనే రమాదేవిని లాగరాయి పీహెచ్‌సీకి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. కార్డియాక్ అరెస్టు వల్లే ఆమె చనిపోయి ఉండవచ్చని అంటున్నారు ఆమె ఆకస్మిక మృతితో ఇరువైపు కుటుంబ సభ్యులు, బంధువులు పుట్టెడు దుఃఖంలో మునిగి పోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బదిలీ భారం

- ఎంటీఎస్ ఉపాధ్యాయుల ఆవేదన
- ఏకోపాధ్యాయ పాఠశాలలకు హెచ్‌ఎంలుగా నియామకం
- దూర ప్రాంతాలకు బదిలీ

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) విధానంలో పనిచేస్తున్న 220 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ప్రస్తుతం బదిలీల బాధలు, దూరాభారాలతో సతమతమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మూడేళ్ల కిందట వీరికి ఎంటీఎస్ విధానంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయి. తర్వాత ఏడాదికి జరిగిన బదిలీల ప్రక్రియలో ఉమ్మడి జిల్లాలోని దగ్గర మండలాల్లో ఉన్న పాఠశాలల్లోనే పోస్టులు ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక గత జూన్ నెలలో జరిగిన ఎంటీఎస్ ఉపాధ్యాయుల బదిలీల్లో అనేక లోపాలతో వీరిని 100 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న పాఠశాలలకు పంపించారు. 220 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయుల్లో దాదాపు 75 మందిని ఏకోపాధ్యాయ పాఠశాలలకు బదిలీలు చేయడమే కాకుండా వారికి ప్రధానోపాధ్యాయ బాధ్యతలు అప్పగించారు.

యాప్‌ల భారం

కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ఏడాదిలో 11 నెలల పాటు, అదీ నెలకు రూ.32,470 మాత్రమే జీతం వస్తుంది. మే నెలలో వీరికి జీతం ఉండదు. కూటమి ప్రభుత్వం ఈ ఎంటీఎస్ ఉపాధ్యాయులను 100 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న పాఠశాలకు బదిలీ చేసి, వారిలో కొందరికి ప్రధానోపాధ్యాయ బాధ్యతలు అప్పగించింది. వారిపై యాప్‌ల భారాన్ని బలవంతంగా మోపింది. గత ప్రభుత్వంలో ఈ తరహా ఉపాధ్యాయులను కేవలం సపోర్టింగ్ టీచర్లగానే భావించి, వారిని సమీప మండలాలకు బదిలీ చేసింది. గత జూన్ 23న కాకినాడలో ఎంటీఎస్ ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం వద్ద ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. కేవలం బదిలీల్లో లోపాలతో తమను బలవంతంగా దూరంగా నియమిస్తున్నారని, కొందరికి ఏకోపాధ్యాయ పాఠశాలలకు హెచ్‌ఎంలను చేసి యాప్‌ల బాధ్యతలు అప్పగించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్బంధ బదిలీలు!

ఉన్నతాధికారులు తమను నిర్బంధంగా బదిలీలు చేశారన్న ఆవేదన, ఆందోళన ఎంటీఎస్ ఉపాధ్యాయుల నుంచి వ్యక్తమవుతోంది. ఉదాహరణకు తుని నుంచి ముమ్మిడివరానికి, సామర్లకోట నుంచి ఐ.పోలవరం మండలానికి, రాజమహేంద్రవరం నుంచి అడ్డతీగలకు ఎంటీఎస్ ఉపాధ్యాయులను బదిలీలు చేశారు. అసలే కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, బదిలీల భారం ఒక ఎత్తు అయితే హెచ్‌ఎంగా బాధ్యతలు అప్పగించి యాప్‌ల భారాన్ని మోపడం మరో ఎత్తు. దీని ప్రభావం విద్యాబోధనపై తీవ్రంగా పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దూరాభార బదిలీల వల్ల అనారోగ్య ఉపాధ్యాయులు, దివ్యాంగులు, మహిళలు చాలా అవస్థలకు గురవుతున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో నెలకు ఇచ్చే జీతం రూ.32,470తో అంత దూరం వెళ్లి ఎలా పనిచేయగలరని ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ వెళ్లినా సగం జీతం రవాణా ఖర్చులకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తరగతిలో విద్యార్థులకు పాఠం చెబుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయుడు

యాప్‌లతో ఇబ్బంది



కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా చాలీ చాలనీ జీతాలతో బతుకుతున్న మమ్మల్ని వంద కిలోమీటర్లకు పైబడి దూరంలో ఉన్న పాఠశాలలకు బదిలీలు చేయడం అన్యాయం. మాలో కొందరిని ఏకోపాధ్యాయ పాఠశాలలకు బదిలీలు చేసి ప్రధానోపాధ్యాయుడి బాధ్యతలు అప్పగించారు. యాప్‌ల భారం పెట్టడం ఎంత మాత్రం సమంజసం కాదు. మాలో కొందరు ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నారు. ఈ సమయంలో అంత దూరం బదిలీలు, ప్రధానోపాధ్యాయుడి బాధ్యతులు, యాప్‌ల భారం సరైన విధానాలు కాదు. మేము చేసిన అభ్యర్థనలు, నిరసనలను విద్యాశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.

– ఎ.బాల గోపాలరావు, ఎంటీఎస్ ఉపాధ్యాయుడు

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అవగాహన


విస్తరణ శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం పరిధిలోని ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరిలలో పదోన్నతి పొందిన ఎంపీడీఓల శిక్షణ కొనసాగుతోంది. గత నెల 28న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 26 వరకూ నిర్వహించనున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా గురువారం విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. చనిపోయిన వారితో పాటు గ్రామాన్ని విడిచి వెళ్లిన వారిని గుర్తించి తగిన ఆధారాలతో వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని సూచించారు. దివ్యాంగులు పోలింగ్ బూత్‌లలోకి వచ్చేలా ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. 650 మంది ఓటర్లు మించిన సమయంలో మాత్రమే రెండవ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.

బాలికల హాకీ పోటీలకు సర్వం సిద్ధం


జాతీయ బాలికల జూనియర్ హాకీ పోటీలకు సిద్ధమైన కాకినాడ డీఎస్‌ఏ హాకీ మైదానం

- నేటి నుంచి పదో తేదీ వరకూ నిర్వహణ
- కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో పూర్తయిన ఏర్పాట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలోని డీఎస్‌ఏ మైదానంలో జాతీయస్థాయి జూనియర్ బాలికల హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మైదానంలోని హాకీ టర్ఫ్‌పై శుక్రవారం నుంచి ఈ నెల పదో వరకూ ఈ పోటీలు జరుగుతాయి. 2022లో బాలికల విభాగంలో జూనియర్ నేషనల్ పోటీలను ఇక్కడ నిర్వహించారు. 2023లో సీనియర్ నేషనల్స్ బాలికల విభాగంలో జరిగాయి. ఇప్పుడు మూడోసారి జూనియర్ బాలికల జాతీయ స్థాయి హాకీ పోటీలకు రంగం సిద్ధమైంది. సుమారు రూ.20 లక్షల బడ్జెట్‌తో వీటిని నిర్వహిస్తున్నారు.

29 రాష్ట్రాల క్రీడాకారుల రాక

ఈ పోటీల్లో 29 రాష్ట్రాలకు చెందిన 522 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. వారితో పాటు 58 మంది కోచ్‌లు, మేనేజర్లు, స్థానిక అఫీషియల్స్‌తో కలిపి సుమారు 660 మంది హాజరవుతున్నారు. పోటీల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కమిటీకి అధ్యక్షుడిగా హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణక్య రాజ్, నిర్వహణ కార్యదర్శిగా జి.హర్షవర్ధన్, సంయుక్త నిర్వహణ కార్యదర్శిగా కాకినాడ జిల్లాకు చెందిన వి.రవిరాజు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ షణ్మోహన్ స్వీయ పర్యవేక్షణలో జేసీ రాహుల్ కుమార్.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. పూల్- ఎలో జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, పూల్ -బిలో మధ్యప్రదేశ్, పంజాబ్, చండీఘడ్, పూల్ -సిలో హర్యానా, ఉత్తర్ ప్రదేశ్, బెంగాల్, పూల్ -డిలో ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడుతున్నాయి.

బియ్యం పంపిణీలో కూటమి నేతల కుమ్ములాట


ఉప్పాడలో కూటమి నాయకుల వాగ్వాదం


జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ఎదుట గొడవ పడుతున్న నాయకులు

- టీడీపీ, జనసేన నాయకుల వాగ్వాదం
- ఉప్పాడ సచివాలయం వద్ద ఘటన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

కొత్తపల్లి: మత్స్యకారులకు బియ్యం పంపిణీ చేసే కార్యక్రమంలో కూటమి నాయకులు కుమ్ములాడుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు కాలర్లు పట్టుకుని వాగ్వాదానికి దిగారు. ఉప్పాడ సచివాలయం వద్ద గురువారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. వాతావరణంలో మార్పుల కారణంగా ఉప్పాడ తీర ప్రాంతంలో ఇటీవల సముద్రం అలలు ఎగసి పడి గ్రామంలోకి నీరు చేరింది. దీంతో ప్రభుత్వం ఆ ప్రాంతంలోని మత్స్యకారులకు బియ్యం పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ఆ మేరకు గురువారం ఉప్పాడ గ్రామ సచివాలయం వద్ద తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి పిఠాపురం నియోజవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే బియ్యం పంపిణీపై తమకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించడం ఏమిటంటూ టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. కనీసం అధికారులు కూడా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జనసేన పార్టీ నాయకులకే చెప్పడమేమిటంటూ ప్రశ్నించారు. దీంతో టీడీపీ, జనసేన నాయకుల మధ్య వాగ్వాదం నెలకొంది. మర్రెడ్డి శ్రీనివాస్ ఎదురుగానే కాలర్లు పట్టుకుని తోసుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అయితే తమకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని చెప్పి, ఇప్పుడు రేషన్ బియ్యం ఇస్తున్నారంటూ మత్స్యకారులు మండిపడ్డారు. వాటిని తీసుకునేందుకు నిరాకరించారు.

వనదుర్గమ్మకు త్వరలో ఖడ్గమాల పూజ

- ప్రతి శుక్రవారం నిర్వహించేందుకు దేవస్థానం సన్నాహాలు
- టిక్కెట్ ధర రూ.1,116గా నిర్ణయం
- భక్తుల సలహాలు కోరిన అన్నవరం ఈవో


ప్రత్యేక అలంకరణలో వనదుర్గ అమ్మవారు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో వన సంరక్షురాలిగా, రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారి ఆలయంలో మరో పూజను ప్రారంభించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి శుక్రవారం ఈ ఆలయంలో నిర్వహిస్తున్న చండీహోమం, ప్రతి పౌర్ణమి, అమావాస్యకు నిర్వహిస్తున్న ప్రత్యంగిర హోమాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరలో ప్రతి శుక్రవారం ఖడ్గమాల పూజ ప్రారంభించనున్నట్లు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. ఆ రోజు ఉదయం 7.30 నుంచి 8.30 వరకూ జరిగే ఈ పూజలో పాల్గొనడానికి టిక్కెట్ ధరను రూ.1.116గా నిర్ణయించారు.

విజయవాడలో మాదిరిగానే..

దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనదుర్గ ఆలయ అర్చకుడు అమ్మవారికి ఈ పూజ నిర్వహిస్తారు. భార్యాభర్తలు అమ్మవారికి ఎదురుగా కూర్చుని అర్చకుడు చెప్పిన సూచనల ప్రకారం మంత్రాలు చదువుతూ శ్రీచక్రంపై పసుపు, కుంకుమ, ఇతర ద్రవ్యాలతో ఈ పూజ చేస్తారు. అనంతరం దంపతులకు అమ్మవారి కుంకుమ, రాగి ప్రతిమ, కండువా, రవికల వస్త్రం, 250 గ్రాముల పులిహోర ప్రసాదం అందజేస్తారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించే ఖడ్గమాల పూజ మాదిరిగానే ఇక్కడ కూడా జరుగుతుంది. కాగా.. ఖడ్గమాల పూజపై సలహాలు, సూచనలు ఇవ్వాలని భక్తులు, గ్రామస్తులను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు కోరారు. ఈ నెల 31వ తేదీ లోపు ఈ నంబర్లకు (98484 81536, 98493 63217, 94907 12066)కు తెలియజేయాలని కోరారు. అలాగే కార్యనిర్వాహణాధికారి, వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, అన్నవరం, శంఖవరం మండలం, కాకినాడ జిల్లా చిరునామాకు, endow-eoanna@gov.inకు మెయిల్ ద్వారా సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

అదుపు తప్పి బస్సును ఢీకొన్న కారు

- కారులోని మహిళ మృతి
- కోరంగి వద్ద విషాదం


మందపాటి సుభద్రమ్మ (ఫైల్)


ప్రమాద స్థలంలో ఆర్టీసీ బస్సు, కారు

తాళ్లరేవు: అమలాపురం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓ కారును ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన మందపాటి శ్రీరామరాజు, సుభద్రమ్మ (67) దంపతులు ఐ.పోలవరం మండలం పెదమడి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. జాతీయ రహదారి 216లోని కోరంగి పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో వారి కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సుభద్రమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, భర్త శ్రీరామరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రయాణికులను వేరే బస్సులో వారి స్వస్థలాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కోరంగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాకినాడ-యానాం రహదారిలో గత వారం రోజుల్లో జరిగిన మూడు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు.

ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం

- ఈ నెల 5 నుంచి శాఖల వారీగా సమావేశాలు
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బాపూజీ


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాపూజీ

అమలాపురం టౌన్: ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ అన్నారు. అమలాపురంలోని గొల్లగూడెంలో జిల్లా ప్రభుత్వ సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఎరియర్స్, డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్లు.. ఇలా పలు రూపాల్లో రూ.వేల కోట్లలో ప్రభుత్వం బకాయిలు పెట్టిందన్నారు. జిల్లాలో ఈ నెల 5 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ బకాయిలపై గణాంకాలతో వివరించే వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులకు పలు ఎరియర్స్ కింద ప్రభుత్వం దాదాపు రూ.25 వేల కోట్ల వరకూ బకాయిలు ఉందని గుర్తు చేశారు. ఉద్యోగులకు వారి బాధ్యతలు తెలియజేసి, వారిని పోరాటంలో కార్యోన్ముఖులను చేసేందుకు 'ఉద్యోగులారా... రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' పేరుతో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఎరెండ్స్ లీవులు బకాయిలు చెల్లించలేదని, పీఆర్సీ కమిటీ నియమించలేదని, నాలుగు డీఏలు నేటికీ ఇవ్వలేదన్నారు. ప్రతి ఉద్యోగికి ఎంత చెల్లించాలో ప్రభుత్వం నిర్ధారించాలని, బకాయిలు ఎంత ఇవ్వాలో ఉద్యోగి రిజిస్టర్ (ఎస్ఆర్)లో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పలు ఎరియర్స్ బకాయిలను ఎప్పటిలోగా చెల్లిస్తారో లిఖిత పూర్వకంగా రాసి ష్యూరిటీ బాండ్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వీరబాబు, జిల్లా కార్యదర్శి కె.మల్లిబాబు, ఉపాధ్యక్షుడు సీహెచ్ విజయ్‌కుమార్, కోశాధికారి జేఏ రాజ్‌కుమార్, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలు, మండపేట ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పద్మం సిల్వర్ జ్యూయలరీ ప్రారంభం


తునిలో పద్మం సిల్వర్ జ్యూయలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ నిధి అగర్వాల్

తుని: స్థానిక మెయిన్‌రోడ్డులోని రావిచెట్టు దగ్గర పద్మం సిల్వర్ జ్యూయలరీ షాపును హీరోయిన్ నిధి అగర్వాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మం సిల్వర్ జ్యూయలరీ యాజమాన్యం వారి మరో శాఖను తునిలో తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. షోరూంలో ప్రదర్శించిన ఆభరణాలు తనకు ఎంతో నచ్చాయన్నారు. మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి రూ.లక్ష కొనుగోలుపై రూ.50 వేల సిల్వర్ నగలు, రూ.50 వేల కొనుగోలుపై రూ.25 వేల సిల్వర్ నగలు, రూ.25 వేల కొనుగోలుపై 12.5 వేల సిల్వర్ ఆభరణాలు ఉచితంగా అందిస్తున్నారన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడాసక్తి పెంచుకోవాలి

- పారిశ్రామిక వేత్త మట్టే ఆదిశంకర్
- జేఎన్‌వీలో ముగిసిన కబడ్డీ మీట్


కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆది శంకర్, స్రవంతి

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రీడాసక్తి పెంపొందించుకోవాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, లలిత రైస్ ఇండస్ట్రీస్ ఈడీ మట్టే ఆది శంకర్, ప్రముఖ డెర్మాలజిస్ట్ డాక్టర్ మట్టే స్రవంతి అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్లస్టర్ స్థాయి కబడ్డీ మీట్ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడా నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఈటీ సత్యనారాయణ, అనురాధ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, పాండిచ్చేరికి చెందిన 458 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

మూడు రోజుల పాటు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో 101 లీగ్ మ్యాచులు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, పీఈటి సత్యనారాయణ తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో ఖమ్మం క్లస్టర్, అండర్-17 విభాగంలో పిమోగా క్లస్టర్, అండర్-19 విభాగంలో కృష్ణ క్లస్టర్ విజేతలుగా నిలిచాయన్నారు. అండర్-14 బాలుర విభాగంలో బీదర్ క్లస్టర్, అండర్-17 విభాగంలో కడప క్లస్టర్, అండర్-19 విభాగంలో పిమోగా క్లస్టర్ విజయం సాధించాయని తెలిపారు. రీజినల్ మీట్‌లో ఆల్‌రౌండ్ ఛాంపియన్‌గా పిమోగా క్లస్టర్ (కేరళలో కొన్ని జిల్లాలు), కర్ణాటకలో కొన్ని జిల్లాలు కలిసి ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకున్నాయన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు

కాకినాడ క్రైం: యువతిని మోసగించిన వ్యక్తికి కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. కాకినాడ టూ టౌన్ సీఐ మజ్జి అప్పల నాయుడు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గుడారిగుంటకు చెందిన బల్ల నిర్మల్ కుమార్ స్థానికంగా ఉంటున్న ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని మోసగించాడు. ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ అయ్యేందుకు మందులు ఇచ్చాడు. ఈ విషయాన్ని బాధితురాలు సూరంపూడి దీప్తి ఆమె సోదరి మోర్తా నీలిమ పెద్దలకు తెలిపారు. వారి సమ్మతితో పెళ్లికి అంగీకరించిన నిర్మల్ కుమార్.. పెళ్లి చేసుకోకుండా కాలయాపన చేసి, చివరికి చేసుకోనని తేల్చేశాడు. దీంతో దీప్తి 2023 నవంబరు 10వ తేదీన నిర్మల్ కుమార్‌పై కాకినాడ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. రాజమహేంద్రవరం ఎనిమిదవ అదనపు సెషన్స్ కోర్టులో కేసుపై విచారణ, వాదోపవాదాలు జరిగాయి. నేరం రుజువు కావడంతో నిర్మల్ కుమార్‌కు జడ్జి బెన్నయ్య నాయుడు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాధాకృష్ణ వాదనలు వినిపించారు. ముద్దాయికి శిక్ష పడేందుకు ప్రాసిక్యూషన్‌కు సహకరించిన సీఐ మజ్జి అప్పలనాయుడుతో పాటు సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టిన హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశులును జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

ఐసీడీఎస్ పీడీగా లక్ష్మి



కాకినాడ క్రైం: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి(ఐసీడీఎస్ పీడీ)గా చెరుకూరి లక్ష్మి గురువారం కాకినాడ గాంధీనగర్‌లోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాజానగరం సీడీపీవోగా పనిచేస్తూ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి పీడీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్న ఆమెకు తాజాగా పదోన్నతి లభించింది. ప్రభుత్వం ఆమెను కాకినాడ జిల్లా ఐసీడీఎస్ పీడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీడీ లక్ష్మిని మిషన్ వాత్సల్య డీసీపీవో వెంకట్ ఆధ్వర్యంలో బృందం కలిసి అభినందనలు తెలిపింది. అనంతరం శాఖ సిబ్బందితో పీడీ సమీక్ష నిర్వహించారు.